క్లుప్తంగా

కొనసాగుతున్న ఫ్రైడే-డ్రైడే



పెదంకలాం కాలువల్లో తీస్తున్న పూడికలను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కుమారవర్మ, హెచ్‌వీ వరలక్ష్మి

సీతానగరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే సంకల్పంతో ఫ్రైడే (శుక్రవారం) డ్రైడేగా ప్రకటించడంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, పెదంకలాం పీహెచ్‌సీ మహిళా హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదంకలాం, నిడగల్లు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది సంయుక్తంగా నిర్వహిస్తున్న పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం కోర్టు సముదాయాల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా రెండో అదనపు జడ్జి ఎస్.దామోదర్ రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని కక్షిదారులు ఉపయోగించుకుని తమ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని కేసులు రాజీ చేసుకోవడానికి ఈ లోకదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఇంటింటికీ వెళ్లి, పింఛన్లు ఇవ్వండి

గుమ్మలక్ష్మీపురం: జూలై 1వ తేదీన ఇంటింటికీ వెళ్లి, పింఛన్లు పంపిణీ చేయాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లను ఎంపీడీవో జి.జగదీష్ కుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించి, సాయంత్రంలోగా పూర్తి చేయాలని తెలిపారు. పెన్షన్లకు సంబంధించిన నగదును శనివారమే విత్‌డ్రా చేసుకోవాలని తెలిపారు.

పక్కాగా సోషల్ ఆడిట్



ఉపాధి పనులపై ఆడిట్ నిర్వహిస్తున్న డీఆర్‌పీలు

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, సోషల్ ఆడిట్ పక్కాగా జరుగుతోంది. 8 మంది డీఆర్‌పీలు బృందాలుగా ఏర్పడి, గ్రామాల్లో తిరుగాడుతూ ఏడాది కాలంగా జరిగిన పనుల నిర్వహణపై ఆడిట్ చేస్తున్నారు. ఆడిట్ అనంతరం మండల స్థాయిలో జూలై 4వ తేదీన ప్రజావేదిక ఉంటుందని ఏపీవో సత్యవతి తెలిపారు.

'నేను బడికి పోతా' ర్యాలీ



ర్యాలీలో ఎంఈవో దుర్గారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

వంగర: మండలంలోని అరసాడ గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమం ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. మనఊరు బడి-భవితకు గుడి, పెద్దలు పనికి-పిల్లలు బడికి అని ఉపాధ్యాయులు, విద్యార్థులు నినాదాలు చేశారు. ఎంఈవో వై.దుర్గారావు మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



ఎరువుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో శిరీష

బాడంగి: మండలంలోని పలు ఎరువుల షాపుల్లో ఏవో కె.శిరీష శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని, రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా షాపు యజమానులపై చర్యలకు వెనుకాడమన్నారు. స్టాక్ రిజిస్టర్, విక్రయాల రిజిస్టర్, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. స్టాక్ బోర్డు, ధరల పట్టికను షాపు బయట ఉంచాలన్నారు. అనంతరం వరి, మొక్కజొన్న విత్తనాల నాణ్యతను పరీక్షించేందుకు విజయనగరంలోని ల్యాబ్‌కు విత్తనాలు తరలించారు. ఆమె వెంట ఏఈవో పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా పట్టణ అభివృద్ధి

● ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర

పార్వతీపురంటౌన్: రాజకీయాలకతీతంగా పార్వతీపురం పట్టణ అభివృద్ధి అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ఆధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు ఎవరూ శత్రువులు కాదని రాజకీయ ప్రత్యర్థులు మాత్రమేనన్నారు.

ఏ అభివృద్ధి పని అవసరమైనా తనను సంప్రదించవచ్చని ప్రజల సమస్యలే ముఖ్యం తప్ప రాజకీయాలు కాదన్నారు. ఎజెండాలో పొందుపరిచిన 14 అంశాలను అధికారులు చదివి వినిపించారు. కౌన్సిలర్లు లేవనెత్తిన సందేహాలకు ఎమ్మెల్యే సమాధానాలు ఇస్తూ సమస్య పరిష్కారానికి మార్గం చూపారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణాభివృద్ధే ధ్యేయం

పార్వతీపురం పట్టణ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలో దశాబ్దాల కాలం నాటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. ఇందుకే సంబంధించి పూర్తి కార్యాచరణ రూపొందించాలని, చిన్నపాటి సమస్యలను సైతం త్వరితగతిన పరిష్కరించేలా సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తం

● మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్



పార్వతీపురంటౌన్: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని ఈ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ వ్యాధుల బారిన పడకుండా పట్టణ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమం జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నిర్వహించనున్నామని తెలిపారు. శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు పార్వతీపురం పట్టణంలో డీసిల్టింగ్ పనులు జరుగుతున్న వేళలో సిల్ట్‌ను పూర్తిస్థాయిలో తీయించే విధంగా చూసుకోవాలని యాంటీ లార్వా స్ప్రేయింగ్ అన్ని వీధుల్లో జరిగేలా ఏఎస్‌ఎం బాధ్యత వహించాలని సూచించినట్లు తెలిపారు.

దుకాణాల దగ్గర డస్ట్‌బిన్‌లు

ప్రధాన రహదారిలో ఉన్న దుకాణాల దగ్గర డస్ట్ బిన్స్ పెట్టించే విధంగా చూసుకోవాలని డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయని దుకాణదారులకు అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. అదే సమయంలో సచివాలయం ఎమినిటి సెక్రటరీలను ఉద్దేశించి ప్రతి రోజు వార్డుల్లో కుళాయిలు సరఫరా అయ్యే సమయంలో క్లోరినేషన్ టెస్టులు చేయాలని, వాటర్ ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చూడాలని, ఏరియా వారీగా కుళాయి లీకులను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు వివరించారు.

వ్యాన్ ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు



మాట్లాడుతున్న సీఎస్‌డీటీ ఎస్.రమేష్‌బాబు

సీతానగరం: రేషన్ కార్డులున్న వారందరికీ పాత విధానం(డోర్) ద్వారానే నిత్యావసర (రేషన్) సరుకులు పంపిణీ చేయనున్నామని సీఎస్‌డీటీ ఎస్. రమేష్‌బాబు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన డీలర్లతో నిత్యావసర సరుకుల పంపిణీ విధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, అంగన్వాడీ కేంద్రాలకు నిర్దేశించిన గడువులోగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నామని చెప్పారు. అలాగే రేషన్ వినియగదారులందరికీ నిర్దేశించిన గడువులోగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ సరుకులు చేరే విధంగా రేషన్ డీలర్లు విధిగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద, వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అలాగే రేషన్ సరుకుల పంపిణీ విధానంతో జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

తలెత్తుకునేలా అభివృద్ధి చేశాం



బలిజిపేట పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

● మాజీ ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: నియోజకవర్గం, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తలెత్తెకునేలా అభివృద్ధి పనులు నిర్వహించామని, పార్టీ అధికారంలోకి రాలేదని ఎవరూ అధైర్యపడవద్దని, నిరాశ పడవద్దని, ప్రజలు మనవెంట ఉన్నారని రానున్న రోజుల్లో ప్రజల తరఫున పోరాడి తిరిగి అధికారంలోకి వద్దామని మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బలిజిపేట మండలకేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పార్టీ ఓటమికి గల కారణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎవరూ అభివృద్ధి చేయనంతగా మండలంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టామని, గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు చేసి, ప్రజల అవసరాలకు అనుగుణంగా నడుచుకున్నామన్నారు. ప్రజలు ఇంకా ఎక్కువ ఆశించి ఉండవచ్చని అదే కారణంతో ఓటమి పాలయ్యామన్నారు. ప్రజలను చూసి తలదించుకునే విధంగా వైఎస్సార్‌సీపీ నాయకులు అక్రమాలు చేయలేదని, ప్రజలకు మేలు మాత్రమే చేశారన్నారు. ఓటమితో ఎవరూ కుంగిపోవాల్సిన అవసరం లేదని మనోధైర్యంతో ముందుకు నడుద్దామని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన గొప్ప పార్టీ వైఎస్సార్‌సీపీయేనన్నారు. గడిచిన 23ఏళ్లుగా తనకు తోడుగా ఉన్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు భవిష్యత్తులో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, పి.నారాయణరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో బ్లడ్‌బ్యాంకులు ఏర్పాటుచేయాలి



మంత్రి సంధ్యారాణితో మాట్లాడుతున్న గోపాలరావు తదితరులు

సాలూరు: గిరిజన ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో రక్తనిధి కేంద్రాలు ఏర్పాటుచేయాలని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి గోపాలరావు కోరారు. ఈ మేరకు మంత్రిని శుక్రవారం ఆయన సాలూరు పట్టణంలోని ఆమె స్వగృహంలో కలిశారు. గిరిజన ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో రక్తనిల్వలు లేకపోవడం వల్ల రక్తం కోసం విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లోని ఆస్పత్రులకు పంపించడంతో ఏజెన్సీ ప్రాంత రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ విద్యాభివృద్ధి అధ్యక్షుడు నాగేశ్వరరావు, సూర్యయాదవ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



జనార్దన్‌నాయుడు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: ఉద్యోగులకు వారు చేసిన మంచి సేవలే గుర్తింపునిస్తాయని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఎంఈవో–2 బడే జనార్దన్‌నాయుడు ఉద్యోగ విరమణ పురస్కరించుకుని, స్థానిక బీఎస్‌ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపంలో వీడ్కోలు సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై, జనార్దన్‌నాయుడును సన్మానించి, విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. ఏ ఉద్యోగికైనా తన ఉద్యోగ కాలంలో చేసిన గొప్ప సేవలే వారికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెడతాయన్నారు. ప్రతిఒక్కరూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, మంచి ఉద్యోగులుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు పలు సంఘాల నాయకులంతా కలిసి జనార్దన్‌నాయుడు దంపతులను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో బి.చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో పి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యను ప్రైవేట్‌పరం కాకుండా చర్యలు తీసుకోండి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ విద్యను ప్రైవేట్ పరం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు అమ్మఒడి పథకం వర్తింపజేయడం, కొన్ని వేలాది గ్రామాల్లో 3, 4, 5 తరగతులు అందుబాటులో లేకపోవడం వంటివి తల్లిదండ్రుల దృష్టిని ప్రైవేట్ పాఠశాలల వైపు తమ పిల్లలను మరలే విధంగా చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనవసరంగా అమలు చేస్తున్న యాప్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట ఆ సంఘ గౌరవాధ్యక్షుడు దుర్గారావు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రావు, సింహాచలం ఉన్నారు.

ఉద్యానవనాల పెంపకానికి ప్రోత్సాహం

బాడంగి: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవనాల పెంపకానికి ప్రోత్సహిస్తున్నట్లు ఏపీవో విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. మండలంలోని ముగడ, భీమవరం, కోటిపల్లి, వాడాడ, కోడూరు, ఆకులకట్ట, గొల్లాది గ్రామాల్లోని 16 మంది రైతులకు చెందిన 14 ఎకరాల్లో జీడిమామిడి, కొబ్బరి తోటలను పెంచుతున్నట్లు పేర్కొన్నారు. వాడాడ జిల్లా పరిషత్ పాఠశాలలో ఇనిస్టిట్యూషనల్ ప్లాంటేషన్, లక్ష్మీపురంలో చేపలచెరువు గట్టుపై మొక్కలు నాటేందుకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అలాగే గొల్లాది నుంచి భీమవరం, ముగడ, పాల్తేరు అప్పలనాయుడు చెరువు వరకు వేగావతి నుంచి వచ్చే సాగునీటి కాలువను బాగుచేసే పనులు చేపడుతున్నామన్నారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం



జీడితోటలో ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు



పత్తిసాగుకు సిద్ధం చేసిన పంటపొలం

మక్కువ: తొలకరి పలకరించడంతో, రైతన్నలు ఖరీఫ్‌సాగుకు సమాయత్తమయ్యారు. ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతోపాటు, మధ్యమధ్యలో వాతావరణం తెరిపివ్వడంతో, రైతులు పంటపొలాలను సిద్ధం చేస్తున్నారు. మెట్టుపంటల సాగుకు అవసరమైన మెట్టుభూములు దుక్కిదున్ని సిద్ధం చేశారు. జీడి తోటల్లో అంతరపంటగా సాగుచేసేందుకు దుక్కులు జరిపిస్తున్నారు. పలువురు రైతులు వరినారుమళ్లను తయారుచేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్‌సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సేకరించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న డాక్టర్ డి.పావని

సీతానగరం: ప్రజల సహకారంతోనే దోమల నివారణ సాధ్యమని, అందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని మండల వైద్యాధికారి బి.పావని అన్నారు. ఈ మేరకు శుక్రవారం పెదభోగిలి పంచాయతీలో ఉన్న రెండు సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది, వైద్యారోగ్యశాఖ అధికార సిబ్బందికి సర్పంచ్ జె.తేరేజమ్మ అధ్యక్షతన దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ వర్షాలు కురవడం వల్ల దోమలు చేరడం, దోమల వల్ల జ్వరాలు, అతిసార, జలుబు తదితర వ్యాధులు వస్తాయని, వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్తచర్యగా దోమల వ్యాప్తిని అరికట్టాలని చెప్పారు. గ్రామాల్లో వైద్యసిబ్బంది ముందుగా నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి ప్రజల సహకారంతో నీటి గుంతలను పూడ్చి వేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరుబయట మలవిసర్జన వల్ల అనర్థాలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ,హెల్త్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్, అంగన్వాడీ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు, ఎంఎల్‌హెచ్‌పీలు వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించేలా బాలికలను తీర్చిదిద్దాలి



బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా కళాకారులు

కొమరాడ: అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా రాణించేలా బాలికలను తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని విక్రంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం అనే అంశంపై కళాజాతా కళాకారులు శుక్రవారం అవగాహన కల్పించారు. బాలికల హక్కులు, బాలికల రక్షణకు ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు, బాల్యవివాహాలవల్ల కలిగే అనర్థాలు, పోక్సోచట్టం వంటి వాటిని బుర్రకథ, ఇతర ప్రదర్శనల ద్వారా కళాకారులు తెలియజేశారు.

అనంతరం ఐసీడీఎస్ పీవో మాట్లాడుతూ బాలికల శారీరక, మానసిక వికాసంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాలని, ప్రతిరోజూ వారికి పౌష్టికాహారం అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శారదాంబ, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వంటల పరిశీలన



మధ్యాహ్న భోజనఅమలు తీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు వంటలు చేసే సమయంలో, విద్యార్థులకు భోజనాలు పెడుతున్న సమయంలో నిర్వాహకులు వ్యాధులనివారణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన వంటలను ఆయన పరిశీలించి ఆహార పదార్థాల రుచి చూశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా మండలంలోని అన్నిగ్రామాల్లో మధ్యాహ్న భోజన పథకం వంటల్లో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సీజన్‌లో అతిసార వ్యాధి ఎక్కువగా వచ్చే ఆస్కారం ఉన్నందున ముందుగా వంటలు చేస్తున్న నిర్వాహకులు చేతులకు గ్లౌజులు ధరించాలని, ఆహారపదార్థాలు తాజాగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎంఎల్‌ఎన్ ప్రకసాద్, ఇన్‌చార్జి హెచ్‌ఎం, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

తాగునీటి వనరుల్లో క్లోరినేషన్



కాశీపట్నంలో క్లోరినేషన్ జరిపిస్తున్న పంచాయతీ సిబ్బంది

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలో గల అన్ని గ్రామాల్లో తాగునీటి బోరు బావుల వద్ద పంచాయతీ కార్యదర్శి జగన్‌మోహన్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం క్లోరినేషన్ జరిపించారు. వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితమై, ప్రజలు డయేరియా బారిన పడకుండా నివారించేందుకు ముందస్తుగా క్లోరినేషన్ జరిపిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఈ సందర్భంగా తెలిపారు. అలాగే నంద పంచాయతీలో సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో కాలువల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్యకార్మికులు తొలగించారు. నంద ఏజెన్సీ గిరిజన పంచాయతీ కావడంతో, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుద్ధ్యపనులు జరిపిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహేష్ తెలిపారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహం పరిశీలన



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

● డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్ రావు అన్నారు. ఈ మేరకు ఆయన పార్వతీపురం మండలంలోని డోకిశీల పీహెచ్‌సీ, గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో ల్యాబ్ రికార్డులను తనిఖీ చేసి ఈ మధ్య నమోదైన జ్వరాలు, అందులో మలేరియగా గుర్తించినవి, రోగుల ప్రస్తుత ఆరోగ్య స్థితి తదితర వివరాలపై ఆరా తీశారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన రక్త పూతలకు సత్వరమే పరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్న గ్రామాల్లో సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. సిక్ రూమ్‌ను తనిఖీ చేసి నిర్వహణ సరిగా ఉండాలని, సిక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని వార్డెన్‌కు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఐశ్వర్య, ఏఎంఓ సూర్యనారాయణ, జిల్లా కీటక జనిత వ్యాధుల కన్సల్టెంట్ రామచంద్రుడు, ఈఓ తిరుపతిరావు, సూపర్‌వైజర్ కృష్ణంరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొబ్బిలి రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని, పూర్తిస్థాయి సమాచారంతో అధికారులు కూడా హాజరుకావాలన్నారు.